ప్రజాశక్తి

సోమవారం 20 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

గిరిజనులతో మాట్లాడుతున్న జాలా అంజయ్య

కబ్జాదారులకు అండగా ఉండటం సరికాదు..

- ప్రభుత్వ పెద్దల అండదండలతో గిరిపుత్రుల శ్మశానంపై వైసిపి నేత కన్ను..
- శ్మశాన స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడతాం..
- కెవిపిఎస్, వ్యకాస నేతలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

గిరిజనులకు అండదండలు ఇవ్వాల్సినటువంటి ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ స్థలాలు కాజేసే వారికి అండదండలు ఇవ్వడం సరైన పద్ధతి కాదని, శ్మశాన భూమిని కాజేయాలనుకుంటున్న వైసిపి నాయకుడి వెనక ఉన్న బడా వైసిపి నాయకులు ఉన్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య విమర్శించారు. శింగరాయకొండ మండలం, పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్, మల్లికార్జున నగర్, పోతుల చెంచయ్య కాలనీకి సంబంధించిన శ్మశాన భూమి ఆక్రమణ నేపథ్యంలో స్థానిక గిరిజనులతో కలిసి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదివారం శ్మశానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 105లో సుమారు నాలుగు ఎకరాల భూమిని స్థానికులు చనిపోతే శ్మశానం కోసం రెవెన్యూ అధికారులు కేటాయించారని, ఈ స్థలం ఏ విధంగా అయినా కాజేయాలని ఓ వైసిపి నాయకుడు చూస్తున్నాడని చెప్పారు. ఆరు నెలల ▶ 2లో

టిడిపి, జనసేన ఉమ్మడి పోరు..

- ఇప్పటికే ప్రభుత్వ వైఫల్యాలూ.. సమస్యలపై ఆందోళనలు
- నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణల్లో మార్పులపై చర్చ

శింగరాయకొండలో రోడ్డు గుంతలను చూపిస్తూ.. నిరసన తెలుపుతున్న టిడిపి ఎమ్మెల్యే స్వామి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం- జనసేన పార్టీలు కలిసి పోటీ చేసేందుకు అన్ని విధాలా సన్నాహాలు సాగుతున్నాయి. వైసిపిపై పోరుకు ఈ రెండు పార్టీల నేతలూ సన్నద్ధమవుతున్నారు. సీట్ల పంపకాలు ఎలా జరుగుతాయనే విషయాన్ని అలా ఉంచితే రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలూ కలిసి పోటీ చేస్తాయన్నది తథ్యం. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు తర్వాత జరిగిన పరిణామాలు ఆ దిశగా ఈ రెండు పార్టీలను నెట్టాయనే చెప్పక తప్పదు. గత ఎన్నికల్లో తెలుగుదేశం-వైసిపి విడివిడిగానే పోటీ చేశాయి. జనసేన వామపక్షాలతో కలిసి అభ్యర్థులను బరిలోకి దింపింది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కలిసి పోటీ చేసిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో రాజకీయ సమీకరణల్లో మార్పులు స్పష్టంగా చోటుచేసుకున్నాయి. జనసేన దూరం కావడంతో కొన్ని నియోజకవర్గాల్లో గెలుపుపై ప్రభావం చూపిందని తెలుగుదేశం ఆనాడే అంచనాకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగానే ఈ ప్రభావం అనేక నియోజకవర్గాల్లో తేటతెల్లమైంది. జరిగిన నష్టాన్ని గుర్తించిన తెలుగుదేశం సామాజికకోణంలో ఆలోచించి కొద్దికాలంగా జనసేనతో కలిసి పోటీ చేయాలనే ఆలోచనకు వచ్చింది. అందుకు తగ్గట్టుగానే జనసేన నేతలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై జనసేన వాడివేడిగానే ఆరోపణలు సంధిస్తోంది. దీంతో జనసేనపైనా వైసిపి గట్టిగానే దృష్టి సారించింది. పవన్‌కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు తెలుగుదేశంతో కలిసి పోతారనే ప్రచారం చేశారు. వైసిపితో రాజకీయంగా శత్రుత్వం పెరగడంతో జనసేనకు అనివార్యంగా తెలుగుదేశంతో జత కట్టాల్సిన పరిస్థితి కూడా వచ్చింది. ఎందుకంటే ఒంటరిగా పోటీ చేసినందున ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కూడా గెలవలేదు. పైగా కేంద్రంలో బిజెపితో కలిసి ఉన్నా ఇక్కడ ఆ పార్టీకి ఓటు బ్యాంకు లేదు. బిజెపితో కన్నా తెలుగుదేశంతో పోతేనే రాజకీయంగా కొన్ని సీట్లు సాధిస్తామని జనసేన నేతలు అంచనాకు వచ్చారు. జిల్లాల వారీగా కొన్ని స్థానాలు ఎంపిక చేసుకున్నారు. ఎన్నికల నాటికి సర్దుబాటు చేసుకునేందుకు సన్నాహాల్లో ఉన్నారు. జిల్లాకు ఒక స్థానం ఇచ్చేందుకు ఈ పాటికే నిర్ణయం జరిగిపోయింది. ఏ జిల్లాలో ఎక్కడనేది స్పష్టతకు రావాల్సి ఉంది. ఓటు బ్యాంకు, గెలుపునలకు అవకాశాలను పరిశీలన చేసుకున్నాకే సీట్ల పంపకాలు చేసుకునేందుకు ఈ రెండు పార్టీల నేతలు ఆలోచిస్తున్నారు. జిల్లాలో దర్శి నియోజకవర్గంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి ఇన్‌ఛార్జిని పెట్టలేదు. ఈ స్థానాన్నే జనసేనకు కేటాయించే ఆలోచనలో ▶ 2లో

బిగ్‌స్క్రీన్‌పై వరల్డ్‌కప్ ఫైనల్స్

- ఒంగోలు, మినీ స్టేడియం వద్ద పండుగ వాతావరణం
- భారత్ ఓటమితో నిరాశతో వెనుదిరిగిన అభిమానులు

ఒంగోలు, మినీస్టేడియంలో ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిగ్ స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్స్ మ్యాచ్ క్రీడాభిమానులలో ఆనందాన్ని నింపింది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు డాక్టర్ ఆనంద్ డిఎస్ఏ స్టేడియంలో వరల్డ్ కప్ భారత్, ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను లైవ్ టెలికాస్ట్ చేశారు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఒంగోలు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి క్రీడాభిమానులు, ప్రజలు తరలి వచ్చారు. దీంతో మినీ స్టేడియం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చిన క్రీడాభిమానులకు, ప్రజలకు స్నాక్స్, వాటర్ బ్యాటిళ్ళు, కుర్చీలు ఏర్పాటుచేశారు. మ్యాచ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చిన క్రీడాభిమానులు ప్రజలు జాతీయ పతాకాలను చేతబూనారు. భారత్ ఓటమి చెందడంతో క్రీడాభిమానులు నిరాశతో వెనుదిరిగారు. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన వారిలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఆయన తనయుడు ప్రణీత్ రెడ్డి, వైసిపి నాయకులు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు ఆదిపూడి శాండిల్య, వైసిపి నాయకులు, క్రీడాభిమానులు, ప్రజలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

– యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురంలో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సినిమా థియేటర్లలో స్క్రీన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేశారు.

ఒంగోలులో మ్యాచ్‌ను వీక్షిస్తున్న బాలినేని

వై.పాలెంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న మంత్రి సురేష్

పాడి గేదె రూ.10 వేలు.?

- అంతుచిక్కని వ్యాధి కారణంగా తెగనమ్ముకుంటున్న రైతులు
- ఆర్థికంగా చితికిపోతున్న పశుపోషకులు

ప్రజాశక్తి-అద్దంకి

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమే ప్రధాన జీవనాధారం. సాధారణంగా పాడి గేదె రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. ప్రస్తుతం అద్దంకి మండలం, తిమ్మాయపాలెంలో ఓ వ్యాధి కారణంగా పశువుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. మందులు వాడినా పెద్ద ఉపయోగం ఉండటం లేదు. దీంతో పాడి రైతులు గేదెలను రూ.5 నుంచి రూ.10 వేలకు తెగనమ్ముకుంటున్నారు.

అద్దంకి మండలం, తిమ్మాయపాలెంలో సుమారు 400 గేదెలు ఉన్నాయి. ఇటీవల పదుల సంఖ్యలో పశువులకు అంతుచిక్కని వ్యాధి సోకింది. పాడి గేదెలు దాణా, పశు గ్రాసం తినలేక, నీరు తాగలేక నీరసించి పడిపోతున్నాయి. పాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండటం లేదు. వైద్యులు పరీక్షలు జరిపి మందులు ఇస్తున్నప్పటికీ కోలుకోవడం లేదు. రైతులు పంటలు సక్రమంగా చేతికి అందివచ్చే పరిస్థితులు లేనందున పాడి గేదెల పెంపకం సాగిస్తున్నారు. అత్యధిక కుటుంబాలు పాల అమ్మకాల ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నాయి. గేదెలకు అంతుచిక్కని వ్యాధి సోకడంతో పాడి రైతులు ఆందోళనలో ఉన్నారు. పశు వైద్యులను సంప్రదించి చికిత్స అందిస్తున్నప్పటికీ గేదెలు కోలుకోవడం లేదు. దీంతో ఆందోళన చెందుతున్న రైతులు చేసేదేమీ లేక లక్ష రూపాయల విలువైన తమ పాడి గేదెలను రూ.5 వేలు, రూ.10 వేలకు తెగనమ్ముతున్నారు. ఇప్పటికే గ్రామంలో అడుసుమల్లి మురళి, వీరాంజనేయులు, మందలపు శ్రీకాంత్ తదితర పాడి రైతులకు చెందిన గేదెలు వ్యాధి బారిన పడ్డాయి. ఈ వ్యాధి మరింతగా వ్యాప్తి చెందితే గేదెలను కోల్పోతామన్న ఆందోళనలో రైతులున్నారు. ఇతర గ్రామాలకు కూడా ఈ అంతుబట్టని వ్యాధి సోకితే తమ జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితులున్నాయని, పశువైధ్యాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యాధి బారినపడిన గేదె

ఇది అంటువ్యాధి కాదు..

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎం.హనుమంతరావు

మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో పాడి గేదెలకు వచ్చింది అంటువ్యాధి కాదు.. ఇది ఇతర గేదెలు, ప్రాంతాలకు వ్యాపించే పరిస్థితి లేదు. జోరీగలు కుట్టడం, వాతావరణ పరిస్థితుల కారణంగా గేదెలు జబ్బున పడతాయి. ఈ వ్యాధి నివారణ సాధ్యమే.. పశు వైద్యాధికారుల బృందం ఏడి మోహన్‌రావు ఆధ్వర్యంలో గేదెలకు పరీక్షలు చేసి.. మందులు ఇచ్చారు. సంచార వాహనం కూడా అందుబాటులో ఉంచాం. ఇతర గ్రామాల్లో ఈ వ్యాధి సోకినట్లు ఆనవాళ్లు లేవు. ఇప్పటికే వ్యాధి సోకి ఇబ్బందులు పడుతున్న గేదెలను సంరక్షిస్తున్నాం. రైతులు ఆందోళన చెందొద్దు..

బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసిన డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: క్రికెట్ క్రీడాభిమానుల కోరిక మేరకు స్థానిక అమరావతి గ్రౌండ్లో ఆదివారం వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు బిగ్ స్క్రీన్‌ను కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాటు చేశారు. ఆస్ట్రేలియా వర్సెస్ ఇండియా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ టిడిపి శ్రేణులు, జనసేన శ్రేణులు, క్రీడాభిమానులతో కలిసి ఆయన వీక్షించారు. బిగ్ స్క్రీన్ ద్వారా వరల్డ్ కప్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఏర్పాట్లు చేసిన డాక్టర్ ఉగ్రకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి డయల్ యువర్ డిటిపిఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపిఎస్ ఆర్టీసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే క్రమం, సర్వీసు అందించటంలో లోటుపాట్లు తెలుసుకునేందుకు ప్రతినెల 20న నిర్వహించే డయల్ యువర్ డిటిపిఒ కార్యక్రమాన్ని సోమవారం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వారి సమస్యలను, మెరుగైన సేవలు అందించటానికి తమ అమూల్యమైన సలహాలను ఇచ్చి ఎపిఎస్ ఆర్టీసి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

అన్నదానం ప్రారంభిస్తున్న శిద్దా రాఘవరావు లక్ష్మీపద్మావతి దంపతులు

దీక్షలు చేపట్టిన అయ్యప్ప, భవానీ, శివ స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా సుధీర్‌కుమార్ శృతి దంపతులు ఆదివారం లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా శిద్దా వెంకటేశ్వర్లు వెంకటసుబ్బమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో దీక్షలో ఉన్న స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు శిద్దా రాఘవరావు లక్ష్మీపద్మావతి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప కలశ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులను, టిటిడి బోర్డు డైరక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ శృతి దంపతులను ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ సముదాయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయ్యప్ప కలశప్రతిష్ట చేశారు. అభిషేకాలు నిర్వహించారు. మహాగణపతి పూజ, గంగపూజ, మండపాధన, నవగ్రహ పూజ నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది కూడా జనవరి నెల వరకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం అయ్యప్ప మహాపడి భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు రామకృష్ణశాస్త్రి అయ్యప్ప కలశప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శిద్దా ట్రస్టు సభ్యులు శిద్దా వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సురేష్, శిద్దా సుధాకర్ దంపతులు శిద్దా బాలాజీ, శిద్దా పెదబాబు, శిద్దా సాయిబాబు, శిద్దా వెంకటాంజనేయ ప్రసాద్, జ్యోతి గ్రానైట్ ఎక్స్‌పోర్ట్సు సిఈఓ శివరామ్, బొమ్మిశెట్టి రవికిరణ్, చల్లగండ్ల హనుమంతరావు, గ్రంధి శ్రీహరి, నూకల సురేంద్ర, అయ్యప్ప, భవానీ స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళలను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ అధికారులు

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంధాలయంలో మహిళాభ్యుదయ సమితి, నరసం ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ మహిళలకు స్ఫూర్తి ప్రదాత, ఆదర్శ మహిళ, ఉక్కు మహిళగా ఖ్యాతి గాంచిన దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పుట్టినరోజున నగరంలో ప్రముఖ మహిళలను సత్కరించటం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళా న్యాయవాది, సమాజసేవకురాలు దేవకుమారి, ప్రముఖ గాయని, ఉపాధ్యాయిని మున్నంగి ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మున్నంగి రాజకుమారిని ఘనంగా సత్కరించారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహబూబ్ బాషా వారి సంస్థ తరపున విద్యార్థులకు బిస్కెట్లు పళ్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, లైబ్రేరియన్ సంపూర్ణ, నరసం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, కె శాంతిలతశ్రీ, నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు, నాళం నరసమ్మ, ధర్నాశి చిరంజీవి, మా మూర్తి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి, జనసేన ఉమ్మడి పోరు..

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశం నేతలున్నారు. ఇక్కడ జనసేనకు ఆశించే సామాజికవర్గం ఓట్లు బాగానే ఉన్నాయి. కొత్త అభ్యర్థిని రంగంలోకి దించుతారా? లేక ఈ పాటికే ఎమ్మెల్యే లేదా మాజీ ఎమ్మెల్యేలలో ఉన్న వారెవరైనా ప్రస్తుతం వాళ్లున్న పార్టీల్లో టిక్కెట్టు రాకుంటే ఈ వైపు వస్తారా? అనేదీ చూడాలి. అలా వచ్చిన వారికి జనసేన టిక్కెట్టు ఇస్తారా? అనే చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం బలమైన నేతలు ఎవరైనా వస్తే అధిష్టానాలు కూడా పరిశీలించాలని భావిస్తున్నాయి. జిల్లాలో ఒక స్థానంలో జనసేన, 7 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ నుంచి అభ్యర్థులు పోటీలో ఉంటారన్నది సుస్పష్టం. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ఈ వారంలోనే రెండు పార్టీల సమన్వయకమిటీ సమావేశాలు సంయుక్తంగా నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని, వైసిపిని ఓడించాలని సమావేశాల్లో వాడివేడిగా చర్చించి ప్రకటనలు చేశారు. ఈ రెండు పార్టీలూ ఒక కూటమిగా మారాయి. ఇక వైసిపిపై పోరాటానికి సన్నద్ధమయ్యాయి. ఎన్నికల్లోనే కాకుండా ప్రజాసమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా రోడ్ల దుస్థితిపై రెండు పార్టీలూ కలిసి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇక నియోజకవర్గాల్లో ఈ కూటమి ప్రభావం ఎన్నికల్లో ఎలా ఉండబోతుందనే విశ్లేషణలూ సాగుతున్నాయి. రాజకీయ పార్టీల్లో ఈ తరహా చర్చలు మొదలయ్యాయి. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో జనసేన ప్రభావం స్పష్టంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒంగోలు, దర్శి, గిద్దలూరు, తర్వాత కనిగిరి నియోజకవర్గాల్లో జనసేన ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. గతంలో ఒంగోలులో జనసేన అభ్యర్థికి 10 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. ఈ మేరకు తెలుగుదేశం అభ్యర్థికి నష్టం జరిగిందనే చర్చ ఉంది. ఇప్పుడా ఓట్లతో పాటు అదనంగా పడే ఓట్లు ఎన్ని ఉంటాయన్నదీ చూడాలి. నగరంలో కాపు ఓటింగు బలంగానే ఉంది. జనసేన వైపు తిరిగే ఓటు బ్యాంకుపైనే ఇప్పుడు ఉత్కంఠ చర్చ సాగుతోంది. వైసిపికి ఏ మేరకు తగ్గుతుందనే విశ్లేషణలూ సాగుతున్నాయి. దర్శిలోనూ బలమైన ఓటింగు ఉంది. ఇక్కడ అభ్యర్థిగా జనసేన నుంచే పోటీ చేస్తే కాపు సామాజికవర్గం నుంచి మెజార్టీ ఓట్లు ఈ పార్టీకే పడతాయి. గిద్దలూరులో అన్నిటికంటే ఎక్కువ ఓట్లున్నాయి. ఇక్కడ మరింత ప్రభావం ఉండనుంది. గతంలో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన అన్నా రాంబాబు ఎమ్మెల్యేగా గెలిచారు.ఈ కారణాల రీత్యా ఇక్కడ ఈ సారి రాజకీయ సమీకరణల్లో భారీగానే మార్పులుంటాయనే చర్చ నడుస్తోంది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎంతో కొంత ప్రభావం లేకుండా ఏమీ ఉండదని భావిస్తున్నారు. ఈ కారణాల రీత్యా ఆచీతూచీ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితులు రాజకీయ పార్టీల్లో కనిపిస్తున్నాయి.

కబ్జాదారులకు అండగా ఉండటం సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

క్రితం గిరిజనులకు అడ్డం తిరిగి రచ్చ చేశాడని, గిరిజనుల ఫిర్యాదుతో కబ్జాదారుడు చాన్‌బాషాపై అట్రాసిటీ కేసు కూడా పోలీసులు నమోదు చేశారని గుర్తుచేశారు. గిరిజనుల శ్మశాన భూమిపై కన్నేసిన వైసిపి నాయకుడు వరుసగా ఆ భూమి తనదేనంటూ ప్రభుత్వ పెద్దల అండదండలతో గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. శ్మశానవాటికను ట్రాక్టర్‌తో దున్నడంతో ఆ ప్రాంతంలోని గిరిజనుల మతదేహాలు కూడా పైకి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన విషయంపై ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని చెప్పారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి కోట్ల రూపాయలు విలువ చేయడంతో ఆ భూమిని చేజిక్కించుకునేందుకు వైసిపి నేతలు పావులు కదుపుతున్నారని విమర్శించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ శ్మశానం స్థలం ఆక్రమణ నుండి కాపాడేవరకు ముందుండి పోరాడుతామని గిరిజనులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి మోజేష్ రజక వత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు టంగుటూరి రాము పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐఎ నెం.249/2022 ఇన్ ఓఎస్ నెం.107/2022

వేమిరెడ్డి అరుణ్‌కుమార్‌రెడ్డి ...పిటిషనర్/వాది

వర్సెస్

అద్దంకి సుబ్బరాయుడు డైడ్ హిజ్ ఎల్ఆర్ఎస్
అద్దంకి లక్ష్మమ్మ వగైరాలు
...5వ రెస్పాండెంటు/ ప్రతివాదులు

ఆర్ 5 రెస్పాండెంట్ అడ్రస్:-
అద్దంకి శివకుమారి(ఆర్ఎస్), తండ్రి లేట్ అద్దంకి సుబ్బరాయుడు భర్త : గుడిపాటి రవి, రెడ్డి కాలని కొండ దగ్గర, కొంగలవీడు రోడ్డు, గిద్దలూరు టౌన్ & మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి నోటీసులు పంపిన తీసుకోనందున నీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది: 22.11.2023న ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది:22.11.2023
స్థలం : గిద్దలూరు
తేది:18.11.2023 **పిడతల రాజశేఖరరెడ్డి**
వాది తరుపు అడ్వకేట్, గిద్దలూరు
సెల్ నెం. 9948897433

పేపరు ప్రకటన
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్.నెం.127/2019

కుమ్మరి రంగయ్య ...వాది

వర్సెస్

షేక్.ఖాజా ...ప్రతివాది

ప్రతివాది చిరునామా:-
(ప్రతివాది) షేక్.ఖాజా తండ్రి మహబూబ్‌బాషా, వయస్సు సుమారు 45సం॥లు, బిజినెస్, ముస్లిం, నల్లబండ బజార్, గిద్దలూరు పోస్టు మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీపై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరుపై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 20వ తేది నవంబర్ నెల 2023సం.లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10.30గం॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని మీరు పై కోర్టులో హాజరై మీ క్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

స్థలం : గిద్దలూరు
తేది:18.11.2023 **శ్రీ దూదేకుల సిద్దయ్య**
వాది తరపు అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.8919520567

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐఎ నెం.350/2022 ఇన్ ఐఎ నెం.130/2022
ఇన్ ఓఎస్.నెం.107/2022

వేమిరెడ్డి అరుణ్‌కుమార్‌రెడ్డి ...పిటిషనర్/వాది

వర్సెస్

అద్దంకి సుబ్బరాయుడు
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

5వ రెస్పాండెంట్ అడ్రస్:-
అద్దంకి శివకుమారి(ఆర్ఎస్), తండ్రి లేట్ అద్దంకి సుబ్బరాయుడు భర్త : గుడిపాటి రవి, రెడ్డి కాలని కొండ దగ్గర, కొంగలవీడు రోడ్డు, గిద్దలూరు టౌన్ & మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి నోటీసు పంపిన తీసుకోనందున నీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది: 22.11.2023న ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది:22.11.2023
స్థలం : గిద్దలూరు
తేది:18.11.2023 **పిడతల రాజశేఖరరెడ్డి**
వాది తరుపు అడ్వకేట్, గిద్దలూరు
సెల్ నెం. 9948897433

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం.163/2023

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకి, గిద్దలూరు రెప్రజెంటెడ్ బై హిట్స్ మేనేజర్ ...వాది

వర్సెస్

సుగ్రీవ నిర్మల ...ప్రతివాదులు

1వ ప్రతివాది:-
సుగ్రీవ నిర్మల భర్త చెంచయ్య,
డోర్.నెం.8-17-569, పాములపల్లె రోడ్డు,
గిద్దలూరు గ్రామం, ప్రకాశం జిల్లా.

2వ ప్రతివాది:-
శివాపురం సురేష్, తండ్రి వెంకటేశ్వర్లు,
డోర్.నెం.1-3-13-4ఎ, నటరాజ్‌వీధి, గిద్దలూరు గ్రామం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది బ్యాంకి వారు దావా బాకి రాగోరి ప్రతివాదులపైన దావా దాఖలు చేసివున్నారు. శ్రీ కోర్టు వారు మీరు హాజరగుటకు 20.11.2023వ తేదికి వాయిదా వేసినారు. వాయిదా రోజు ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు దావాను తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గిద్దలూరు **ఇట్లు**
తేది:18.11.2023 **వల్లెల వెంకటరామిరెడ్డి**
వాదితరపు అడ్వకేటు, గిద్దలూరు.
సెల్ నెం.9885927205

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం.524/2022

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బేస్తవారిపేట బ్రాంచి,
రెప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్
బేస్తవారిపేట ...వాది

వర్సెస్

పోతిరెడ్డి మహేశ్వరరెడ్డి ...ప్రతివాది

ప్రతివాది అడ్రస్:-
పోతిరెడ్డి మహేశ్వరరెడ్డి తండ్రి రంగారెడ్డి
డోర్.నెం.2-33, పాపినేనిపల్లె గ్రామం, పోస్టు,
అర్ధవీడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి సమన్లు పంపిన తీసుకోనందున నీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది: 20.11.2023న ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది:20.11.2023
స్థలం : గిద్దలూరు
తేది:18.11.2023 **పిడతల రాజశేఖరరెడ్డి**
వాది తరుపు అడ్వకేట్, గిద్దలూరు
సెల్ నెం. 9948897433

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం.6/2022

సిండికేట్ బ్యాంకు గిద్దలూరు బ్రాంచి
ప్రస్తుతం కెనరా బ్యాంకు గిద్దలూరు బ్రాంచి
రెప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్
గిద్దలూరు ...వాది

వర్సెస్

1.షేక్.షంషీర్
2.షేక్.మహబూబ్‌వలి ...ప్రతివాదులు

ప్రతివాదుల అడ్రస్:-
డి1: షేక్.షంషీర్, తండ్రి మహబూబ్‌వలి
ప్రొ.షంషీర్ జ్యువలర్స్, డోర్.నెం.4-9-126, షరాఫ్ బజార్, గిద్దలూరు టౌన్& మండలం, ప్రకాశం జిల్లా.
డి2: షేక్.మహబూబ్‌వలి, తండ్రి : చిన్నమౌలాలి సాహెబ్, ప్రొ.చాందినీ జ్యువలర్స్, డోర్.నెం.4-9-126, షరాఫ్ బజార్,గిద్దలూరు టౌన్ & మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి సమన్లు పంపిన తీసుకోనందున నీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది: 21.11.2023న ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీవకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది:21.11.2023
స్థలం : గిద్దలూరు
తేది:18.11.2023 **పిడతల రాజశేఖరరెడ్డి**
వాది తరుపు అడ్వకేట్, గిద్దలూరు
సెల్ నెం.9948897433

సముద్రతీరంలో పటిష్ట భద్రతా చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

సముద్రతీరంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కార్తీకమాసం సందర్భంగా సముద్రతీరంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. సూర్యలంక, ఓడరేవు, రామాపురం బీచ్‌లలో చేసిన భద్రతా ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలోని సముద్రతీరాలకు కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి రోజులలో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున పోలీస్ శాఖ అంచనా ప్రకారం సూర్యలంక సముద్రతీరంలో సుమారు ఐదు లక్షల మంది, వాడరేవు సముద్రతీరంలో సుమారు లక్ష మంది పవిత్ర స్నానాలు ఆచరించారన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. దానికి అనుగుణంగానే తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సముద్ర స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం టెంపరరీ టాయిలెట్స్, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. సూర్యలంక సముద్రతీరంలో ప్రస్తుతం 10 మంది గజ ఈతగాళ్లను నియమించినట్లు తెలిపారు. వారు గత సంవత్సర కాలంలో సుమారు 64 మంది యాత్రికుల ప్రాణాలను రక్షించారన్నారు. కార్తీక పౌర్ణమి రోజున ఎక్కువమంది స్విమ్మర్లను వినియోగించనున్నట్లు తెలిపారు. భక్తులు సముద్రతీరంలో స్నానం ఆచరించే ప్రదేశాన్ని 150 మీటర్లకు ఒక సెక్టార్ గా విభజించి లైఫ్ బాయ్స్, రోప్స్, లైఫ్ జాకెట్స్ ధరించిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్ళను నియమించామన్నారు. ఎవరైనా సముద్రంలో మునిగిపోతే వారిని తక్షణం రక్షించడానికి సముద్రంలో పడవలలో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

ఖాసింవలీకి సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఖాసిం వలిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజి, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్రం నాయకులు రఫీ అహ్మద్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిమాల సంపత్ కుమార్, మాల భేరి జాతీయ అధ్యక్షుడు చప్పిడి ప్రీతం, మాల యువసేన జిల్లా అధ్యక్షుడు మేడికొండ సాగర్, చీరాల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నీలం శక్తి ప్రదీప్ మాదిగ, చైతన్య వేదిక అధ్యక్షులు తేళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంధాలయంలో భారతదేశంలోని క్రీడలు- మహిళలు అనే అంశంపై ఆదివారం డిబేట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆశా రాణి ప్రథమ స్థానం, నలంద ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సిరి చందనారెడ్డి ద్వితీయ స్థానం, వికాస్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పర్విన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సమియ తబసంలు తృతీయ స్థానం సాధించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సంధర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ, ఉపాధ్యాయులు హేమలత, జ్యోతి పాల్గొన్నారు.

పాశం వెంకటేశ్వర్లుకు సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమాజ్ వాదీ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు యాదవ్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పందరబోయిన రవిశంకర్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాను పార్టీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎంబిబిఎస్ సీట్లల్లో బీసీలకు జరిగిన అన్యాయంపై పెద్దఎత్తున ఉద్యమం, కులగణన కోసం రాష్ట్ర వ్యాప్తంగా వందలాది సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు వైవి.సుబ్బారావు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ఎర్రగడ్డ నాగరాజు, డబ్బుకొట్టు రామకృష్ణ, కల్యాణ్ కుమార్, కార్తీక్ రాజు, రవి కిరణ్, దేవరాల రవణయ్య, బంకా చిరంజీవి, పులి రమణ, కొత్తగోర్ల వెంకటేశ్వర్లు, కసిబిసి నాగేశ్వర రావు, మందగిరి వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిసిసి అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం ఈదా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి గరీబీ హఠావో నినాదంతో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలు చేశారన్నారు. ఉక్కు మహిళగా గుర్తింపు పొంది అలీన దేశాల అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి ప్రపంచ నేతగా ప్రసిద్ధి గాంచారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ కోచైర్మన్ ఉద్ధండి మల్లికార్జునరావు, ఎస్‌కె.రసూల్, కొప్పోలు సుబ్బారావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మార్కాపురం :** మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పాలనను నేటి తరం పాలకులు స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త సయ్యద్ జావిద్ అన్వర్ తెలిపారు. స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధి చిత్ర పటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. అనంతరం జావిద్ మాట్లాడుతూ ఇందిరా గాంధి దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం రామకృష్ణారెడ్డి, తిరుమలశెట్టి రామయ్య, ఇస్మాయిల్, మతిన్‌బాష, ఫక్రుమియా, బొగ్గు రామిరెడ్డి, సమీర్, రిజ్వాన్, అంజి పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 106వ జయంతి ఎపిసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ 16 సంవత్సరాలు ప్రధానమంత్రిగా, ఏడు సంవత్సరాలు జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పనిచేశారన్నారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పాకిస్తాన్‌తో యుద్ధంలో భారత్ విజయం సాధించడంలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి బాలకష్ణారెడ్డి, నాయకులు వై.లక్ష్మయ్య, ఎం.లక్ష్మయ్య, దానియేలు, హనుమానాయక్, రామయోగయ్య, పెద్దబాబు, చెన్నకేశవులు, అచ్యుతరావు, గుంటి అచ్చయ్య, గాలెయ్య, చిట్టిబాబు, చంటయ్య, దాసు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం

కార్తీక మహోత్సవాలకు ఆలయంలో ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు పట్టణంలోని సగిలేరునది ఒడ్డున దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానం కార్తీకమాస మహోత్స వాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సహకారంతో ఆలయంలో శోభాయమానంగా తయారైనట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రభుత్వం, దాతల నుంచి నిధులు సేకరించి దేవస్థానాన్ని కొత్త హంగులతో తీర్చిదినట్లు ఆయన తెలిపారు. కార్తీక మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు అనిల్ శాస్త్రి తెలిపారు.

'జగనే కావాలి'లో అధికారులు ఎలా పాల్గొంటారు?

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైసిపి చేపట్టిన 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయిలో ఎంపిడిఒ, ఇతర అధికారులు, పంచాయతీ స్థాయిలో కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ఎలా పాల్గొంటారని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి వీరభద్రాచారి ఉన్నతాధికారులను సూటిగా ప్రశ్నించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులుగా సిసి రూల్స్‌కు విరుద్ధంగా, రాజకీయ పార్టీ కార్యకలాపాలలో ప్రత్యక్షంగా పాల్గొనటం ఉద్యోగ బాధ్యలతో పాటు, నియమ నిబంధనలు ఉల్లంఘించినట్లేనన్నారు. తమకేమీ పట్టదన్నట్లు చోద్యం చూస్తూ, ప్రోత్సహిస్తున్న ఉన్నతాధికారుల తీరు ఆక్షేపణగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాధనంతో జీతాలు, ఇతర ఆదాయాలు, సౌకర్యాలు పొందుతున్నారని గ్రహించి ప్రజా సేవకులుగా వ్యవహరించాలి తప్ప రాజకీయ నాయకులుగా కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి లోకనాథం, పొద్దుటూరి భాస్కర్, వి ఉదయ కుమార్, గూరీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ పగలగొట్టి నగదు చోరీ

సిఎస్ పురంరూరల్ : సిఎస్‌పురం మండలం అరివేముల గ్రామంలోనున్న అంకాలమ్మ ఆలయంలోని హుండీని గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని నగదును అహరించారు. అందిన సమాచారం ప్రకారం... ఆలయ పూజారి రోజులోలే శనివారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శుభ్రం చేసేందుకు లక్ష్మి అనే మహిళ ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చింది. హుండీ పగల కొట్టి ఉండటాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ అనిల్ కుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీంను రప్పించి ఆలయ పరిసరాల్లో వేలిముద్రలు సేకరించారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు.

గొర్రెల కొష్టం దగ్ధం

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని పడమటి బజార్‌లో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన కొష్టం ప్రమాదవత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ప్రమాదం గురించి స్థానిక అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే కొష్టం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ. రెండు లక్షల మేర ఆస్తి నష్టం సంబవించినట్లు బాధితుడు నారాయణ తెలిపారు.

21, 22 తేదీల్లో మాగుంట పర్యటన

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 21, 22 తేదీల్లో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఒంగోలులోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించు జిల్లా సలహా, సంప్రదింపుల కమిటీ సమావేశానికి హాజరవుతారు. 11.30 గంటలకు ప్రకాశం భవనంలోని కలెక్టర్ వీడియో సమావేశ మందిరంలో జరిగే ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలకు హాజరవుతారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార యాత్ర ర్యాలీలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభలో పాల్గొంటారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

యర్రగొండపాలెం : రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ,అభివద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మొగుళ్ళపల్లి పంచాయతీ సర్పంచి కర్నాటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మొగుల్ళపల్లి రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులు, పశువులు, గొర్రెల మేకల పెంపకం దారులకు క్యూఆర్ కోడ్‌తో హోలోగ్రామ్ స్టిక్కర్లు అంటించిన ఆరోగ్య సంరక్షణ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను, ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పశువులకు పశు సంచార అంబులెన్స్‌ల ద్వారా వైద్య సేవలందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ మంత్రు నాయక్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దారవీడు

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూరిబా పాఠశాలలో దిశ చట్టం మరియు సాధికార వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నర్విహించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, గ్రంథ పాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక ప్రదర్శన, మ్యూజికల్ చైర్స్, పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో బద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డిఎస్‌పి

సూర్యలంక తీరంలో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

కార్తీక మాసం సందర్భంగా సూర్యలంక తీరంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కార్తీక మాస పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు సముద్రం తీరం వెంబడ పటిష్టమైన భద్రతా చర్యలు ఆదివారం తీసుకున్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతును సూచిస్తూ ఆ పరిధి దాటి ఎవరు లోపలికి వెళ్లకుండా కర్రలు ఏర్పాటు చేశారు. అందరికీ కనిపించే విధంగా ఆ కర్రలకు ఎరుపు రంగు జెండాలు కట్టారు. యాత్రికుల రక్షణ కొరకు గజ ఈతగాళ్ళను నియమించారు. భక్తుల వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి అనువైన ప్రదేశాలను సిద్ధం చేశారు. డిఎస్పీ వేంకటేశులు ఆధ్వర్యంలో రూరల్, మెరైన్ పోలీసులు తీరంలో భద్రత చర్యలు చేపట్టారు. ఆయనతో పాటు మెరైన్ సిఐ సుబ్బారావు, రూరల్ సిఐ జి వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

కేర్ డెంటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

పరీక్షలు చేస్తున్న డాక్టర్ సృజన

పట్టణానికి చెందిన కేర్ డెంటల్ ఆధ్వర్యంలో హెూప్ హాస్టల్ విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు ఆదివారం నిర్వహించారు. స్థానిక జగన్నాధపురం హెూప్ హాస్టల్‌లో ఉచిత మెడికల్ క్యాంప్‌లో డాక్టర్ సృజన హాస్టల్ విద్యార్థినీ, విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన విద్యార్థులకు దంత రక్షణ జాగ్రత్తలు వివరించారు. దంతాలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫిజియో థెరపీ సందీప్, హాస్టల్ అధినేత బ్యులా పాల్గొన్నారు.

నిరవధిక దీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

కృష్ణా జలాల కోసం నిరసన దీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణా జలాల పున పంపిణీలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఒను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20, 21తేదీలలో విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో నిరసన దీక్ష వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో కరువు ప్రాంతాలపై తక్షణమే సర్వే నిర్వహించాలని కోరారు. కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 811 టిఎంసీల నీటిని కేటాయించగా దానిలో ఏపికి విభజన అనంతరం 512 టిఎంసీలు, తెలంగాణకు 290టిఎంసీలు కేటాయించబడ్డాయని అన్నారు. దీనిలో మిగులు జలాల వినియోగంపై సుప్రీంకోర్టులో వివాదం నడుస్తుండగా బిజెపి ప్రభుత్వం దానిపై నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట వ్యతిరేకమని అన్నారు. కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ సమయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీలో ఉన్నప్పటికీ కనీసం నోరెత్తి మాట్లాడలేదని అన్నారు. కృష్ణా జలాల పంపిణీ పై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా, రాష్ట్రంలోని కరువు మండలాలకు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - రేపల్లె

రెడ్‌క్రాస్ ప్రతినిధులతో మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. రక్త దాన కార్యక్రమాల ద్వారా రెడ్ క్రాస్ ఆపన్నులకు ప్రాణదానం చేస్తున్నదని అన్నారు. రెడ్ క్రాస్ జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచిన సంస్థని తెలిపారు. రెడ్ క్రాస్ సేవలు మారుమూల ప్రాంతాలకు విస్తరించి ఉన్నాయని అన్నారు. రెడ్ క్రాస్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చెయాలని కోరారు. సంస్థ అనుసరిస్తున్న ఆదర్శ ప్రాయమైన మానవతా స్ఫూర్తిని మరింతగా వ్యాప్తి చేయాలని అన్నారు. అప్పుడే ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సేవలను అందుకో గలుగుతారని అన్నారు. రెడ్ క్రాస్ సమాజసేవ చేసే విషయంలో తాను పూర్తిగా చేదోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. తీర ప్రాంతంలో మంచి పనితీరు కనబరిచిన రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్యను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, రెడ్ క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, విశ్వనాథ గుప్త పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ఆదినారాయణ, పోపూరి సునీల్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, సునీల్

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా బొల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బండారు ఆదినారాయణ, మార్టూరు ఎంపియూపి పీర్లచావిడీ ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోపూరి సునీల్ కుమార్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన యుటిఎఫ్ సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు నూతన కమిటీ ఎన్నికలను పరిశీలించారు. మచ్చ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బొప్పూడి ప్రతాప్, ఉపాధ్యక్షులుగా జి యెహెూషువ, ఎ అన్నపూర్ణాదేవి, కోశాధికారిగా అట్లూరి ప్రశాంత్, కార్యదర్శులుగా ఆర్ ఎల్లమందయ్య, వివి రామాంజలి, డి రవిదేవరాజ్, ఎ చార్లీ బెంజిమిన్, డి వసంతరావు, పి నారాయణరెడ్డి, జానీబాషా, జిల్లా కౌన్సిలర్లుగా చట్టి శ్రీనివాసరావు, చెన్నకేశవులు, శ్రీనివాసులు, రామ్ నాయక్, ఈమని సత్యవర్ధిని, షేక్ మౌలాలి ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా నాయకులు కందిమళ్ల రవిబాబు వ్యవహరించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యూటీఎఫ్ నాయకులు ప్రకటించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన బలరాం

ప్రజాశక్తి - వేటపాలెం

కుందేరు పనులు పర్యవేక్షిస్తున్న ఎంఎల్ఎ కరణం బలరాం

కుందేరు మురుగు కాలువ ఆధునికరణకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి సూచించారు. చీరాల నుండి వేటపాలెం వరకు విస్తరించి ఉన్న కుందేరు మురుగు కాలువ ఆధునీకరణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. చీరాల కోర్టు సెంటర్, అక్కయ్యపాలెం బైపాస్, చల్లారెడ్డి పాలెం విద్యా స్కూల్ వెనుక, వేటపాలెం, రామన్నపేట బైపాస్ జంక్షన్‌లో ఉన్న కుందేరు డ్రైన్ తూములను పరిశీలించారు. కుందేరుపై బ్రిడ్జిల వద్ద పూడిక తీయుట, జమ్ము, తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు జరుగుతున్న పనులు పర్యవేక్షించారు. చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, చేనేతపురి ప్రజలు తాగు నీరు, విద్యుత్ సమస్యలు గురించి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పృధ్వీ ధనుంజయ, దొనెంపూడి తిమోతి, ఎంపీడీఒ నేతాజీ, డ్రైనేజీ డిఈ సుబ్బారావు, ఆర్డబ్ల్యూఎస్ ఎఈలు కాలేషా, రామ్ కుమార్, పంచాయతీ సెక్రటరీ శివలీల, పూర్ణ కుమారి పాల్గొన్నారు.

పిల్లలను బాగా చదివించండి

తల్లిదండ్రులకు ముస్లిం పెద్దల వినతి

ప్రజాశక్తి - పంగులూరు

చిన్నారులను అభినందిస్తున్న ముస్లిం మత పెద్దలు

చిన్నప్పటి నుంచే చదువుల పట్ల అవగాహన కలిగించి, పిల్లలను మంచి చదువు చదివించాలని, భవిష్యత్తును తీర్చిదిద్దాలని, తల్లిదండ్రులకు ముస్లిం పెద్దలు సూచించారు. స్థానిక నూర్ భాషా కాలనీలోని మసీదులో జరిగిన సమావేశంలో హైదరాబాదు నుండి వచ్చిన ముస్లిం పెద్దలు మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేదీనని చదివేనని అన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలని కోరారు. స్థానిక భాషలతో పాటు ఉర్దూలో కూడా పిల్లలను చదివించాలని కోరారు. ఉర్దూ చదువుకోవటం వలన లోకజ్ఞానంతో పాటు మసీదులో నమాజు చేసుకోవటానికి కూడా ఉపయోగ పడుతుందని అన్నారు. ముస్లింల చరిత్ర పట్ల అవగాహన పెంచుకోవడానికి మంచి అవకాశం ఏర్పడు తుందని చెప్పారు. కాలనీలో ఇంటింటికి తిరిగి తల్లి దండ్రులను కలిసి అల్లా తత్వం గురించి, మసీదు, కురాన్, విశిష్టతలను వివరించి చెప్పారు. చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందని చెప్పారు. ఉన్నతమైన భవిష్యత్తుకోసం పిల్లలను బాగా చదివించాలని సూచించారు. చిన్న వయస్సులో ఎవ్వరినీ పనిలో పెట్టవద్దని చెప్పారు. మసీదులో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. మసీదు మౌజన్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో హైదరాబాదు నుంచి వచ్చిన సులేమాన్, నావిద్, హరున్, నజీర్ అహ్మద్, ముహిసిన్ లతో పాటు ఆదుమ్ సాహెబ్ హుస్సన్ సైదా వలి, వలి పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు

మజూరీ పెంచాలని నేడు ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చేనేత కార్మికులకు మంగళగిరిలో పెంచిన మాదిరిగా మజూరిని పెంచాలని డిమాండ్ చేస్తూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా సోమవారం నిర్వహిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం ఐక్య వేదిక నాయకులు మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీలు తెలిపారు. చేనేత కార్మికులకు మజూరీ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నూటికి పదిహేను శాతం మజూరి పెంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని చేనేత కార్మికులు ధర్నాకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు మర్రివాడ వెంకటరావు, బట్టు నాగమల్లేశ్వరరావు, దొంతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచార ఉద్యమ కరపత్రం ఆవిష్కరిస్తున్న కోట వెంకటేశ్వరరెడ్డి

దేశవ్యాప్తంగా సైన్స్ ప్రచార ఉద్యమం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

జెవివి సాంస్కృతిక విభాగం సహకారంతో ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, అభ్యుదయ భావాల వేదిక ఆధ్వర్యంలో సైన్స్ ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ పక్షోత్సవాలపై, ప్రజాస్వామ్యం ఎన్నికలు ఓటరు చైతన్యంపై చర్చా వేదికలు, ఊరూరా జన విజ్ఞానం, చెకుముకి సైన్స్ సంబరాలు తదితర అంశాలపై పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో జి రాజారావు, కె వినయరాజు, దొంతిన శ్రీనివాసరెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, పి మోహనరావు, నూరు బాషా శ్రీనివాస్, ఎస్‌కె సుభాని, మణిబాబు, శివయ్య పాల్గొన్నారు.

జనసేన ఆత్మీయ సమావేశంలో రియాజ్, ఆమంచి స్వాములు

జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం స్థానిక అంబేద్కర్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు రియాజ్, రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గొప్ప నిజాయితీ పరుడని అన్నారు. ఆయన కోసం ప్రతి జనసైనికుడు కష్ట పడి పనిచేయాలని అన్నారు. పార్టీ విధానాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని అన్నారు. వచ్చే ఎన్నికలలో పార్టీ నిర్ణయించినట్లుగా టీడీపీతో సమన్వయంగా పని చేయాలని కోరారు. అధికార వైసిపి చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. సంక్షేమ పథకాలపేరుతో మోసం చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిన వైసిపి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని అన్నారు. వైసిపి అధికారానికి వచ్చినప్పటి నుండి విధ్వంసం చేస్తున్నారని, అవినీతి అక్రమాలు తప్ప అభివృద్ధి లేదని అన్నారు. 2024ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్, అన్ని మండలాల అధ్యక్షులు , వీర మహిళలు, జిల్లా కార్యదర్శులు, టౌన్ అధ్యక్షులు, ప్రోగ్రాం కమిటీ మెంబెర్స్, వందలాదిగా జనసైనికులు హాజరు అయ్యారు.

క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించిన ప్రముఖులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు వీక్షించేందుకు స్థానిక గాయత్రి సినిమా థియేటర్‌లో ఏర్పాట్లు చేశారు. మంత్రి సురేష్ క్రికెట్ అభిమానుల మధ్యలో కూర్చొని క్రికెట్‌ను వీక్షించారు. ఉచితంగా క్రికెట్‌ను వీక్షించే ఏర్పాటు చేయడంతో అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మంత్రి సురేష్‌తో కలిసి క్రికెట్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బోగోలు వెంకట సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సచివాలయ మండల కన్వీనర్ సయ్యద్ జబివుల్లా, సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

మార్కాపురం : వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా స్థానిక విజయా టాకీస్ వద్ద క్రికెట్ అభిమానులతో సందడి నెలకొంది. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ అభిమానుల కోసం 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత బాబి సహకారంతో విజయా టాకీస్‌లో క్రికెట్ మ్యాచ్ లైవ్ ప్రసారం చేశారు. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉచితంగా అవకాశం కల్పించడంతో క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పట్టణ ఎస్ పి.కోటేశ్వరరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన పార్టీల నాయకులు

సహజ వనరులను దోపిడీ చేస్తున్న జగన్

టిడిపి, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జులు

ప్రజాశక్తి - గిద్దలూరురూరల్

ముఖ్యమంత్రి జనగ్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకోవటమే పనిగా పెట్టుకున్నార టిడిపి, జనసేన గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జులు ముత్తుముల అశోక్ రెడ్డి, బెల్లంకొండ సాయిబాబు తెలిపారు. గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నుంచి నరవ గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు, పాములపల్లె వెళ్లే రోడ్లలో ఉన్న గుంతల వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రహదారులపై ఉన్న గుంతల్లో తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో సరైన రోడ్లు లేవన్నారు. రోడ్లన్నీ గుంతలు మయంగా మారడంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయమని గద్దెనెక్కి మాట తప్పిన జగన్ రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ శానేశావలి, మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, కౌన్సిలర్లు పాలుగుళ్ళ చిన్న శ్రీనివాస రెడ్డి, బిల్లా రమేష్ యాదవ్, బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, టిడిపి కాపు నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, ఉలాపు బాలచెన్నయ్య, మాజీ సర్పంచులు చెన్నబోయిన రామకష్ణ యాదవ్, కడియం శేషగిరి, బీసీ నాయకులు పందిళ్ళపల్లి శ్రీనివాసులు, వేములపాటి చంటి తదితరులు పాల్గొన్నారు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మాట్లాడుతున్న ముత్తుముల అశోక్ రెడ్డి

వైసిపి పాలనంలో అభివృద్ధి శూన్యమని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నరవ గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివద్ధి తప్ప వైసిపి పాలనలో ఎలాంటి అభివద్ధి జరగలేదన్నారు. పంచాయతీ నిధులను స్వాహా చేసిన ఘనత జగన్ రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. వైసిపి అరాచక, దోపిడీ పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుకు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, కుసుమమాల మహానంది యాదవ్, గోడి ఓబుల్ రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు వీరిశెట్టి బాలకష్ణ, బాబాయి, జిల్లెల్ల భూపాల్ రెడ్డి, దామిరెడ్డి పాండు, బూనబోయిన శేఖర్ యాదవ్, ఈదుల రామకష్ణా రెడ్డి, మాజీ సర్పంచులు కడియం శేషగిరి, బోధనబోయిన గోపాలకష్ణ యాదవ్, గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు సయ్యద్ శానేశావలి, గొంటు బ్రహ్మారెడ్డి, చేరెడ్డి రసూల్ రెడ్డి, బద్రి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సానల ధీరజ్ బాబు, డాక్టర్ విజయ్

ఈదుమూడిలో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దత్తత గ్రామమైన ఈదుమూడిలో 'మనం – మన ఊరు – మన ఈదుమూడి' సేవా సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు సహకారంతో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్, ఈసీజీ గుండె పరీక్ష, నరాల పరీక్షలు చేసి అందరికీ ఉచితంగా మందులు అందజేశారు. మళ్లీ తదుపరి ఉచిత వైద్య శిబిరం డిసెంబర్ మూడో ఆదివారం నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావూరి వాసు, శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, జనరల్ అండ్ లేపరోస్కోపిక్ సర్జన్ డాక్టరు సున్నపు విజయ్ కుమార్, దంత వైద్య నిపుణురాలు డాక్టర్ నందలూరు సరయు, ఫిజియోథెరఫీ డాక్టర్ పొక్కినగారి ఏడుకొండలు, డాక్టర్ దుష్యంత్, హాస్పిటల్ మేనేజర్ సుధాకర్, రవి, నాగరాజు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు

వధూవరులకు విఎస్ఆర్ ఆశీర్వాదం

సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు పెద్ద కుమార్తె కృష్ణవేణి–బాలకృష్ణ వివాహ వేడుకలు కనిగిరి పట్టణంలోని ఎంజిఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ప్రజాశక్తి-కనిగిరి

చిరంజీవిని సన్మానిస్తున్న వైద్యశిబ్బంది

ల్యాబ్ టెక్నీషియన్‌కు సన్మానం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న చిరంజీవి ఒంగోలు ఎంసిహెచ్ హాస్పిటల్ బదిలీ అయ్యారు. అందులో భాగంగా చిరంజీవికి ఆదివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యుల , వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ రసూల్ , డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ కళా సంధ్య మాట్లాడుతూ అటవీ గిరిజన ప్రాంతంలో ఎక్కువ సంవత్సరాలు విధులు నిర్వహించడం అభినంద నీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలఈశ్వరయ్య, చింతల సిహెచ్ఓ మంత్రు నాయక్, భరత్ భూషణ్, హెడ్‌నర్స్ ఎలిజిబెత్, ఆరోగ్య మిత్రలు దర్శనం రాంబాబు, మందగిరి చంద్రశేఖర్, మణికుమార్, స్టాఫ్ నర్సులు రాజేష్ నాయక్, విజయ జ్యోతి, భాగ్య లక్ష్మి భాయ్, మేరీ బాయ్, నిర్మల భాయ్, ఎస్తేరు, ఎం లక్ష్మి, పద్మావతి, నాగ మల్లేశ్వరి, ఫార్మాసిస్ట్ పిచ్చిరెడ్డి, వెంకటరమణ, శ్రీను, చింతల,కొర్రపోలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మంత్రి సురేష్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్ఐ

మంత్రిని కలిసిన ఎస్ఐ రాజేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజేష్ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆయన క్యాంపుకార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పి కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చిన్నారులపై లైంగిక అకత్యాల అంశం సమాజంలో పెను సమస్యగా తయారైందని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ తిరుమలాదేవి తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో చిన్నారులపై వేధింపుల నివారణా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలాదేవి మాట్లాడుతూ చిన్నారి లైంగిక హింసకు గురైనప్పుడు ఆ విషయాన్ని పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయకుండా బాధిత కుటుంబం మౌనంగా ఉంటున్న సందర్భాలే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ సంస్కతి మారాలన్నారు. బాధిత కుటుంబాల్లో ధైర్యం, చైతన్యం, అవగాహన పెరగాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మిబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కే ఉమామహేశ్వరరావు

కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరావు

ప్రజాశక్తి-కనిగిరి

సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం జరిగింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజా పంపిణీ పథకం అమలు చేసి ఆహార భద్రత కల్పించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం, ప్రతిపక్షమైన టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించే పరిస్థితి లేకుండాపోయిందని విమర్శించారు. ధరలను నియంత్రించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఈ నెల 28,29 తేదీలో విజయవాడలో జరిగే కార్మిక రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి శ్రీనివాసులు, జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, డికెఎం రఫీ, పిసి కేశవరావు, టి రంగారావు, కె మాల్యాద్రి, టి మహేష్, బంకా సుబ్బారావు, పి ఆంజనేయులు, టి ఆవులయ్య, ఐవి రాఘవమ్మ పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కొండపి

ఈ నెల 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కెజి మస్తాన్, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ నాగరాజు కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కర్షక, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే ఈ మహా ధర్నాను జయప్రదం చేయాలని ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరు రంగారావు, జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, వడ్డే హనుమాన్‌రెడ్డి, కోడూరు నాంచార్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, లలితకుమారి ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు కొండపి ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్దకు ధర్నాకు సంబంధించిన కార్యక్రమ వివరాలు తెలపటానికి వస్తున్నారని వెల్లడించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిర

ప్రజాశక్తి-కనిగిరి: ఉక్కు మహిళ దివంగత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 106వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం కనిగిరి మున్సిపల్ ఆఫీసులోని ఇందిరా గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ సేవను కొనియాడుతూ ప్రైవేట్ రంగంలో ఉన్న 20 బ్యాంకులను జాతీయం చేసి ప్రభుత్వ రంగంలోకి తీసుకొచ్చి పేదలందరికీ బ్యాంకుల్లో అకౌంట్లు ఉండేటట్లుగా చేసి గరీబీ హఠావో నినాదంతో పేదల జీవితాల్లో వెలుగు నింపారని అన్నారు. ఆమె జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయ మని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర యువజన కార్యదర్శి, సమన్వయకర్త వేల్పుల రాజశేఖర్, సమన్వయ కమిటీ షేక్ మహ్మద్ బాషా, సంగటి మల్లికార్జునరెడ్డి, కనిగిరి టౌన్ కాంగ్రెస్ పార్టీ అభిమాని చాంద్‌బాషా, అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని చవటపాలెం గ్రామానికి చెందిన కందుల కిషోర్ వివాహ వేడుకలలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎఎంసి ఛైర్మన్ జి రామయ్య చౌదరి, చవటపాలెం గ్రామ టిడిపి నాయకులు, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

'గుంతలు' కూడా పూడ్చలేని ప్రభుత్వం

'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' కార్యక్రమంలో కొండెపి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్రంలో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని చేతగాని ప్రభుత్వం ఉందని కొండెపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిధులు తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం రోడ్లు వేయలేని పరిస్థితిలో మారిపోయిందని అప్పుడు నుంచి ఇప్పటిదాకా ఆ నిధులు అలాగే ఉన్న రోడ్లన్నీ గుంటలుగా మార్చిన ఘనత దక్కిందని ఆదివారంనాడు తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శింగరాయ కొండలో 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకుల పాఠశాల నుంచి ఓవి రోడ్డు మీదగా ఆర్‌అండ్‌బి రోడ్డు, కందుకూరు రోడ్డు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు గుంతలు చూపుకుంటూ వచ్చి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రెండు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు స్వామి మాట్లాడుతూ ఓవి రోడ్లకు నిధులు తీసుకొచ్చిన గుంతలుగా తయారు చేశారని, 22 పనులకు 32 కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చామని, అవి కూడా ఉపయోగంలోకి రాకుండా చేసిన ఘనత వైసిపికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు ఆడకా స్వాములు వేల్పుల సింగయ్య చీమకుర్తి కృష్ణ మంద లపు గాంధీ చౌదరి సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, నక్క బ్రహ్మేశ్వరరావు ఇమ్మడిశెట్టి రామారావు, కల్లగుంట నరసింహ, తెలుగు యువత అధ్యక్షులు షేక్ సనవుల్లా, షేక్ అబ్దుల్ సుబహాన్, శీలం చంటి, సుదర్శి ప్రసాదరావు, జనసేన నాయకులు అయినాబత్తిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో నిరసన తెలుపుతున్న తెలుగుదేశం, జనసేన నాయకులు

కనిగిరి: రోడ్లకుపడ్డ గుంతలు పూడ్చలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని తెలుగు యువత నాయకులు షేక్ ఫిరోజ్, జనసేన మండల అధ్యక్షులు రమేష్‌లు అన్నారు. గుంతల కనిగిరికి దారేది, గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది అంటూ ప్ల కార్డులు చేతబట్టి టిడిపి, జనసేన శ్రేణులు కనిగిరిలో రెండోరోజు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో పలుచోట్ల రోడ్లకు పడ్డ గుంతల వద్ద, గాంధీ చిత్రపటం వద్ద నల్ల బెలూన్లతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సంక్షేమం పేరుతో సంక్షోభ పాలన సాగిస్తున్నారని, అభివృద్ధి జాడలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు వీవిఆర్ మనోహర్‌రావు, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ అహ్మద్, చింతలపూడి తిరుపాలు, ఈదర రవికుమార్, ఆర్‌వి నారాయణ, పాలూరి సత్యం, బుల్ల బాలబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తి: వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని, కనీసం రోడ్లు కూడా వేయలేని పరిస్థితి దాపురించిందని మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కెవిపాలెం-చీమకుర్తి రోడ్డులో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది?' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, గొల్లపూడి సుబ్బారావు, మండల టిడిపి అధ్యక్షులు జి రాఘవరావు, వేల్పుల శ్రీను, ఎస్‌కె రఫీ, సూరంపల్లి హనుమంతరావు, కందిమళ్ల గంగాధరరావు, గంగుల శివపార్వతి, మోమిన్, శేషారావు, జనసేన మండల అధ్యక్షులు పల్లపు శివప్రసాదు, జిల్లా నాయకులు యాదాల కోటేశ్వరరావు, అనిల్, సురేష్, డి నాగరాజు, శ్రీరామ్, మురళి పాల్గొన్నారు.

కనిగిరిలో గుంతల వద్ద నల్ల బెలూన్లతో టిడిపి మహిళల నిరసన

నాగులుప్పలపాడు: తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఏ బిఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని ఉప్పుగుండూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో ఒక్క గుంటకు తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్, మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్యచౌదరి, గుమ్మడి సాయిబాబు, కనగాల శ్రీను, సెల్వం, జాన్సన్, నాగమల్లేశ్వరావు, కె లక్ష్మీ వరప్రసాదు, పీకా బైరేగి, కొమ్మాలపాటి సురేష్, గూడూరి ఝాన్సీ, పాలపర్తి బాలకోటి, కొంజేటి రామకృష్ణ, జనసేన నాయకులు పెంట్యాల కిరణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బూచేపల్లి ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు

ప్రజాశక్తి-దర్శి

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ కప్ ఫైనల్ పోటీలు వీక్షించేందుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొని వీక్షించారు. భారత్ సిక్స్‌లు, ఫోర్‌లు కొట్టినప్పుడు అభిమానుల కేరింతలు ఆకాశాన్నంటాయి. ఫైనల్‌లో భారత్ 240 పరుగులు చేసిన సందర్భంగా అభిమానులు అభివాదం చేశారు.

ఎస్సీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం: డోలా

ప్రజాశక్తి-కొండపి: రాష్ట్రంలో ఎస్సీలకు అభివృద్ధి జరిగిందంటే ఒక్క తెలుగుదేశం పార్టీ హయాంలోనే తప్ప అధికార పార్టీ ఎస్సీ, ఎస్టీ, బిసిలకు చేసింది ఏమి లేదని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బియలమందనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని ఇలవర గ్రామంలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ, టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ ఇటీవల జగన్‌రెడ్డి ప్రభుత్వం హోంమంత్రి సొంత ఊరిలోనే ఒక దళితుడు ఆత్మహత్య చేసుకున్నాడంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ జి రామయ్య చౌదరి, నరసారెడ్డి, వసంతరావు, బత్తుల నారాయణస్వామి, యూత్ అధ్యక్షులు కాలేషా, మండల మహిళా నాయకులు బి ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపిపి దేపూరి రత్తమ్మ, కృష్ణారెడ్డి, చింతల వెంకటరావు, మండలంలోని టిడిపి నాయకులు తెలుగు యువత, గ్రామ పార్టీ నాయకులు, మహాశక్తి మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-దర్శి: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కైపు వెంకట కృష్ణారెడ్డి ముగ్గురికి బహుమతులు అందించారు. ఆదివారం స్థానిక కిజిజి హైస్కూల్‌లో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కైపు వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేసి మెమోంటోను అందించారు. మొదటి బహుమతి కిజిజి పదో తరగతి విద్యార్థి హవీల, రెండో బహుమతి మాధవరెడ్డి హైస్కూల్ విద్యార్థి జీవీ సుబ్బారెడ్డి, మూడో బహుమతి ఎస్ లక్ష్మణగురుతేజ గెలుపొందారు.

కృష్ణా జలాలపై నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-సీఎస్ పురంరూరల్

కృష్ణా జలాలు పంపిణీపై ప్రకటించిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సిపిఐ మండల సమితి అధ్యక్షుడు ఎస్‌కే వై పేదమస్తాన్ డిమాండ్ చేశారు. కరువు మండలాలను గుర్తించడంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీలలో విజయవాడలో చేపట్టనున్న 30 గంటల నిరసన దీక్షకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో చేపట్టే నిరసన దీక్షలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గువ్వల నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రాగి ఏసు, చింతనబోయిన సుబ్బయ్య, ఆర్ అంకమ్మ, వై దానేలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ వివేకానంద పాఠశాల ఆవరణలో దొనకొండకు చెందిన అభయ్ హాస్పిటల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహిం చారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి, సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి ప్రారంభించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో శంకర కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్లు ఆకాంక్ష, స్పందన, నీరజ, సిబ్బంది మొత్తం 300 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. అందులో 120 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించి ప్రస్తుతం 50 మందిని ఆపరేషన్లు నిమిత్తం తరలించారు. మిగిలిన వారికి రానున్న వారంలో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరంగా ఎంతో సహకరిస్తున్న నిర్వాహకులను ఎంపీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌యు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రామేశ్వరరావు

ప్రజాశక్తి-సిఎస్ పురం

కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు వియ్యంకుడు, కదిరి బాబురావు విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ, రక్షిత ఫార్మా కంపెనీ అధినేత, చందనా ఆంజనేయ పట్టాభి రామేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా నియమించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ, యూనివర్సిటీ అధికారులు రామేశ్వరరావును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కదిరి బాబురావు విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ చందనా రామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా నియమితులు కావడం పట్ల కళాశాలల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, ఛైర్మెన్, కెవి ప్రకాశ్‌రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కదిరి పార్థసారథి, కోశాధికారి కదిరి బాలకృష్ణ, కమిటీ సభ్యులు, కళాశాలల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, డాక్టర్ పి వీరన్నగౌడ్ తదితరులు అభినందనలు తెలిపారు.

'గుంతల' రోడ్లపై ప్రయాణం ప్రమాదం

బాపట్లలో రోడ్ల స్థితిపై టిడిపి, జనేసన ఉమ్మడి నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఛిద్రమైన రహదారులపై ప్రయాణానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ మండిపడ్డారు. టిడిపి, జనసేన ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ఆదివారం గుంతల రహదారులపై ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమాన్ని నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు- పొన్నూరు రహదారి మార్గంలో టిడిపి, జనసేన నాయకులు ఉమ్మడిగా నిరసన చేపట్టారు. చందోలు నుండి పొన్నూరు వెళ్లే రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడ్డారని అన్నారు. దెబ్బతిన్న రహదారులపై కనీసం మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైతే కచ్చితంగా ఈ రహదారులన్నీ బాగు చేయిస్తామని అన్నారు. జనసేన కో ఆర్డినేటర్ నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలు ఎవ్వరూ సుఖంగా జీవించలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో జన సైనికులు దాదా, కలాం, అన్సారి, మలిశెట్టి గోపి, మెండు కిషోర్, అద్దంకి చందు, శ్రీకృష్ణ, విజయ మాధురి, సుజిత్, ఆంజనేటష్, సురేంద్ర, సాయి, మహేష్, గోగన ఆదిశేషు, ఇమ్మడిశెట్టి మురళి కృష్ణ, సుధాకర్, మడసాని బాలాజీ, శరాబంది, కూనపరెడ్డి శ్రీనివాసరావు టిడిపి నాయకులు అఫ్జల్, ఏపూరి భూపతిరావు, గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కనమూరి సాంబమూర్తిరాజు, వెంకటపతి రాజు, ఇరగంటి గాంధీ, నక్కల వెంకటస్వామి, రామాంజి పాల్గొన్నారు.

కొల్లూరులో రోడ్ల స్థితిపై టిడిపి, జనేసన నేతల నిరసన

కొల్లూరు : చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి నక్క ఆనందబాబు ఆదేశాల మేరకు కొల్లూరు నుండి తెనాలి వెళ్లే మెయిన్ రోడ్డు, రావికంపాడు వెళ్లే రహదారి, బొద్దులూరుపాడు వెళ్లే రహదారి, దోనేపూడి నుండి పో తర్లంకి వెళ్లే రహదారిలోని గుంతలను టిడిపి, జనసేన నేతలు ఆదివారం పరిశీలించారు. సింగల్ రోడ్డు వస్తే ఆంధ్రప్రదేశ్, డబల్ రోడ్డు వస్తే తెలంగాణని తెలంగాణ మంత్రులు హేళన చేయడం జగన్మోహన్ రెడ్డి

వాహన చోదకుల అవస్థలు పట్టని ప్రభుత్వం

చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన ప్రసాద్, జొన్నలగడ్డ విజయ్ బాబు, తూనుగుంట్ల సాయిబాబా, టిడిపి వేమూరు అధ్యక్షులు దండే వెంకటసుబ్బయ్య, జనసేన నాయకులు ఊస రాజేష్, బొందలపాటి చలమయ్య, ఈమని పవన్, ఈమని మణికంఠ పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టో కరపత్రాలు పంచుతున్న టిడిపి నేతలు

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు షఉటి భవిష్యత్తు గ్యారెంటీ నినాదంతో కరపత్రాలు ఆదివారం పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. వైసీపీ పాలలో ప్రజలకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ ప్రచారం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు టిడిపికి అధికారం ఇవ్వాలని కోరారు. టిడిపి, జనసేన ఉమ్మడిగా ముందుకు సాగుతాయని అన్నారు. తాము ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దీపాల శివప్రసాద్, తాతా వీరాంజనేయులు, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లెలో రోడ్ల స్థితిపై టిడిపి, జనేసన ఉమ్మడి నిరసన

రేపల్లె : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో జనసేన, టిడిపి ఉమ్మడి కార్యచరణకు సిద్దమైనట్లు జనసేన అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అనినారు. గుంతల ఆంధ్ర ప్రదేష్‌కు దారేదనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని ఇసుకపల్లిలో నిజాంపట్నం రోడ్డుపై గుంతల వద్ద టిడిపి, జనసేన నాయకులు ఆందోళన నిర్వహించారు. తాను అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి మద్యం ఇంటింటికీ అందించే విధంగా చేశారని అన్నారు. రహదారులపై గోతులను ఎప్పటికి బాగుచేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తున్నానని చెప్పుకుంటున్న

అద్దంకిలో రోడ్ల స్థితిపై టిడిపి, జనేసన ఉమ్మడి నిరసన

సిఎం జగన్మోహన్ రెడ్డి, రహదారులపై ప్రజలు పడుతున్న పాట్లను పరిశీలించేందుకు పాదయాత్ర చెయ్యాలని అన్నారు. సిఎం స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టకపోతే టీడీపి, జనసేన ఉమ్మడిగా పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీపీ రామారావు, ఇరుపార్టీల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : జనసేన, టిడిపి ఉమ్మడిగా 'గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది' పేరుతో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కొటికలపూడి రోడ్డులోని గుంతల వద్ద ఇరుపార్టీల నేతలు నిరసన తెలిపారు. సైకో రాజ్యంలో రోడ్లు నాశనం అంటూ నినాదాలు చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచాడని ఆరోపించారని టిడిపి, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో గ్రామాలకు పట్టణాలకు అనుసంధానం చేస్తూ రోడ్లు వేశామని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ పాలన మొత్తం అవినీతి మయంగా మారిపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో రోడ్లు ఎలా ఉన్నాయో వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు? మాటలు చెప్పడం తప్ప అభివృద్ధి చేయలేదని అన్నారు. నియోజకవర్గంలో దాదాపు మెజారిటీ రోడ్లు ఇదే పరిస్థితి ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేనిఫెస్టో కరపత్రాలు పంచుతున్న వేటపాలెం టిడిపి నేతలు

వేటపాలెం : చంద్రబాబు ఆదేశాల మేరకు టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు షఉరిటీ కరపత్రాలు మండలంలోని దేశాయిపేట రామానగర్‌లో ఆదివారం పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య, గుత్తి వెంకట శివయ్య, పిచ్చుక వెంకట సుబ్బారావు, యర్రా శివనాగ మల్లేశ్వరి, బుద్ధి దుర్గ మల్లేశ్వరి, దేవన విజయలక్ష్మి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మానికల శ్రీను, పూరి సుబ్బయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కావూరి సుబ్బయ్య, అల్లాడి శ్రీదేవి, అల్లాడి సుబ్రహ్మణ్యం, బల్ల సోమరాజు, బల్ల వీర్రాజు, షేక్ మాభాష పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

ఇందిరాగాంధీకి కాంగ్రెస్ నివాళి

దేశంలో తొలి మహిళ ప్రధానిగా, మహిళల అభ్యున్నత కోసం అహర్నిశలు కృషి చేసిన ఇందిరా గాంధీ చిరస్మరణీయులని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రైలుపేటలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపిన ఇందిరా గాంధీకి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. రాబోయే ఎన్నికలలో దేశానికి ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీని కూర్చోబెట్టడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బక్కా రోశయ్య, దోనేపూడి రవి, దండు రేణుక పాల్గొన్నారు.

దేశాయిపేట స్కూలులో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వేటపాలెం

దేశాయిపేట జడ్‌పి హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతీ మాత విగ్రహంను పట్టబద్రుల సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు ఆదివారం ఆవిష్కరించారు. సభకు హెచ్ఎం మల్లేశ్వరి అధ్యక్షత వహించినారు. ఎంఇఒ పురుషోత్తం, సత్రం మల్లేశ్వరరావు, ప్రొఫెసర్ శివశంకర్, పట్టబద్రుల సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు, ఎ నాగ వీరభద్రాచారి, రోటరీ క్లబ్ అధ్యక్షులు బట్ట మోహనరావు, విశ్వేశ్వరరావు, సుంకర వెంకటలక్ష్మి ప్రసాద్, ఉమ్మిటి శివపార్వతీ, సజ్జ శ్రీధర్‌రావు, బుర్రా సాంబశివరావు, నున్నా శివప్రసాదరావు, గుడిమూటి శేఖర్ బాబు, దేవరకొండ నాగరాజు, రామకృష్ణ, కరణం మురళీకృష్ణ, వంకా శ్రీనివాసరావు, వేటపాలెం జెడ్‌పి హైస్కూల్ ప్రధాన అధ్యాపకులు దుర్గాకుమార్, గుత్తి వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, డాక్టర్ రవిబాబు శ్రీహరిరావు పాల్గొన్నారు.

'26న అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 26న అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రం విజ్ఞప్తి చేశారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ, హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ కు రాజ్యాంగ ప్రతిని అందజేశారన్నారు ఏళ్ల తరబడి విదేశీ పాలనలో ఉన్న భారతదేశాన్ని స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశాన్ని పరిపాలించడానికి రాజ్యాంగం అవసరమైందన్నారు విభిన్న ప్రాంతాలు కులాలు, మతాలు భాషలు సంస్కృతులు ఉన్న భారతదేశానికి అనువైన రాజ్యాంగం రాయటానికి అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగమే నేటికీ అమలులో ఉందన్నారు. 1949 నవంబర్ 26న ఆమోదించిన అంబేద్కర్ రాజ్యాంగం సరిగ్గా రెండు నెలల తర్వాత 1950 జనవరి 26వ తేదీన అమలులోకి వచ్చిందన్నారు అంబేద్కర్ రాజ్యాంగం అమలులోకి వచ్చిన దినాన్ని రిపబ్లిక్ డే గా దేశమంతా జరుపుకుంటున్నారన్నారు. ఈ నెల 26వ తేదీన అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని అధికార పూర్వకంగా నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు రంగవల్లుల పోటీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలులో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

స్థానిక మాటూరు గ్రంధాలయం వారోత్సవాల్లో భాగంగా మహిళలు, విద్యార్థులకు రంగువల్లుల పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలకు గ్రామంలోని మహిళలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. న్యాయ నిర్ణీతలుగా మెడపాటి భవాని వ్యవహరించారు. మహిళా పోలీస్ తిరుమల మాట్లాడుతూ మహిళా సాధికారత, దిశ చట్టంపై అవగాహన కల్పించారు. దిశా చట్టంలోని పలు అంశాలను వివరించారు. మహిళలకు చట్టం ప్రాధాన్యతను తెలిపారు. ముగ్గుల పోటీల్లో జూనియర్ విభాగం నుండి ఏ హాసినిప్రియా, ఎ వెన్నెల, కె మహాలక్ష్మి, సీనియర్స్ విభాగం లో అల్లం జాహ్నవి, నందం సేవిక, కరెంశెట్టి హేమనాగ మణి, బుర్లె ప్రవళిక బహుమతులు సాధించారు. కార్యక్రమంలో పుస్తక పంపిణీ నిర్వాహకులు నీల నాగమణి, లైబ్రేరియన్ కర పాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

కొల్లూరు : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎన్ రామయ్య, హెూంగార్డు మహేష్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనముగా నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి వై రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ రామయ్య మాట్లాడుతూ దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు కొనియాడారు. అనేక రంగాలలో దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లారని అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా దిశ చట్టం, దిశ యాప్ గురించి, మహిళల సాధికార వ్యవస్థ గురించి వివరించారు. విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వారోత్సవాల ముగింపు రోజు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అనంతవరంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ముగ్గులు పోటీలు, జాతీయ గీతాల ఆలాపన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి కనకదుర్గ పాల్గొన్నారు.

కొల్లూరులో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

'సామాజిక న్యాయం' సాధన కోసం

చలో ఢిల్లీకి తరలిరండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కనిగిరి

రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనువాద మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దశాబ్దాల తరబడి అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. దీంతో సామాజిక న్యాయం చట్టుబండలవుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని రెండు లక్షలా 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయకుండా మోడీ ప్రభుత్వం అణగారిన తరగతులకు అన్యాయం చేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టానికి నిధులు కేటాయించకుండా దళిత, గిరిజన పేటలో అభివద్ధిని అడ్డుకున్నారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనుధర్మ శాస్త్రాన్ని నెత్తికెత్తుకొని దాని ఆధారంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. దళిత స్త్రీలను అత్యాచారం చేసి హత్యలు చేస్తున్న దోషులకు మోడీ ప్రభుత్వం అండగా ఉండటం సిగ్గుచేటని అన్నారు. దళితులకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రజాస్వామ్య డిమాండ్లను బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మన దేశం సమైక్యంగా నిలబడిందంటే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన లౌకికరాజ్యాంగం కీలకమని అన్నారు. గ్రామీణ పేదలకు ఎంతో కొంత ఊరట కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి క్రమేపీ ఈ చట్టాన్ని రద్దు చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయీకరణ చేస్తూ దళితులకు విద్య దూరం చేస్తోందన్నారు. ఈ స్థితిలో అణగారిన వర్గాల హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు, సామాజిక న్యాయం సాధనకు డిసెంబర్ 4న చలో ఢిల్లీకి తరలిరావాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జిల్లా నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, కె.జి.మస్తాన్, కె.వెంకటేశ్వర్లు, జి.బాలనాగయ్య, వై వీరనారాయణ, ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాద నివారణ ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ శ్రీనివాసరావు

ఉత్సాహంగా రోడ్డుప్రమాద నివారణ ర్యాలీ

పాల్గొన్న డిటిసి సుశీల, ట్రాఫిక్ డిఎస్‌పి విక్రమ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రమాదాలలో గాయపడిన, మరణించిన వారి జ్ఞాపకార్థం ఉప రవాణా కమిషనర్ ఆధ్వర్యంలో ఆదివారం రహదారి ప్రమాద నివారణ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. వరల్డ్ రిమెంబరెన్స్ డే ఆఫ్ రోడ్డు ట్రాఫిక్ విక్టిమ్స్ నినాదంతో ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ మూడో ఆదివారం రోడ్డుప్రమాదాలలో గాయపడిన, మరణించిన వారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులతో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఆధ్వర్యంలో ట్రాఫిక్ డిఎస్‌పి విక్రమ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ ర్యాలీ చర్చి సెంటర్ నుండి మస్తాన్ దర్గా వరకు వెళ్ళి తిరిగి చర్చి సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవ హారంగా ఏర్పడ్డారు. రహదారి నియమాలు పాటించాలని, ప్రయాణంలో కారులో సీటు బెల్టు, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని నినందించారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాలలో చనిపోయిన వారి కుటుంబసభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో డిటిసి అర్ సుశీల, ట్రాఫిక్ డి.ఎస్.పి విక్రమ శ్రీనివాసరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్‌నాయక్, రోడ్లు, భవనాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నేషనల్ హైవేస్ అధికారులు, సిబ్బంది, మోటార్ వాహన తనిఖీ అధికారులు, మోటార్ వాహన డ్రైవర్లు, డిటిసి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం కోసం ఆదివారం నాడు హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు భవనాలను పరిశీలించారు. మండల కాంప్లెక్స్‌లో ఉన్న సచివాలయం భవనం, అక్కడ ఉన్న బీసీ జూనియర్ కళాశాల హాస్టల్‌ను, అనంతరం ఆర్అండ్‌బి బంగ్లాను పరిశీలించారు. ఈ మూడు భవనాలను పరిశీలించి కోర్టు భవనానికి ఏది అనుకూలమనే విషయంపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం శింగరాయకొండకు కోర్టు

అధికారులతో మాట్లాడుతున్న జడ్జి మన్మథరావు

మంజూరు చేసిన నేపథ్యంలో తాత్కాలికంగా ప్రభుత్వ భవనం కట్టేంతవరకు ఏదో ఒక భవనాన్ని ఏర్పాటు చేసి కోర్టును ప్రారంభించాలన్నారు. కోర్టు హాలుతో పాటు రికార్డు భద్రపరచుకునేందుకు కూడా గదులు ఏ విధంగా ఉంటాయని అంశంపై చర్చించారు. వీరి వెంట కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.విజయ్ బాబు, అడిషనల్ మున్సుబ్ మెజిస్ట్రేట్ ఎన్ మిథున్‌రెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దేశంశెట్టి రమేష్‌బాబు, తహశీల్దార్ సిహెచ్ ఉష, పంచాయతీరాజ్ ఏఈ కోటా శ్రీహరి, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, బక్కముంతల వెంకటేశ్వర్లు, బివి శేషయ్య, రాయి రమేష్, ఎస్సై టి శ్రీరామ్ ఉన్నారు.

సరైన అభ్యర్థిని నిర్ణయించండి

- సిఎం జగన్‌తో మాట్లాడతా
- కొండపి టిక్కెట్ విషయంపై మాజీ మంత్రి బాలినేని

ప్రజాశక్తి-శింగరాయకొండ

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి కొండపి నియోజకవర్గంలో గెలుపు అవకాశాలు ఎవరికి ఉంటాయో మీరు నిర్ణయించి చెప్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి టిక్కెట్ ఇప్పించేందుకు కషి చేస్తానని మాజీ మంత్రి, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర వైద్యవిభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి నివాసంలో అక్కడ ఉన్న ముఖ్య కార్యకర్తలు బాలినేనితో భేటీ అయ్యారు. డాక్టర్ మాదాసి వెంకయ్యకు కొండపి నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని అక్కడ ఉన్న నాయకులు కోరటంతో వచ్చిన వారంతా ఓడిపోతారని చెప్తుంది మీరే కదా.. అసలు కొండేపి నియోజకవర్గంలో గెలిచే నాయకుడు ఎవరో చెప్పి ముందుకు రావాలని సూచించారు. పలానా వ్యక్తి కొండపి నియోజకవర్గం నుంచి

మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

వైసిపి తరపున గెలుస్తారని.. నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నాయకులు కూర్చొని మాట్లాడి ఒక నిర్ణయానికి వస్తే ఆ నిర్ణయానికనుగుణంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రధానంగా గెలిచేది ఎవరో చెబితే తన సొంత నియోజకవర్గమైన కొండపిలో గెలిచే నాయకుడు కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి కొండపి వైసిపి సీటు తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటానని, గెలిపించే బాధ్యత కూడా మీరందరూ తీసుకోవాలని చెప్పారు. గతంలో కూడా కొండపిలో ఓటమికి కారణం తానేనంటూ కొంతమంది చేసిన ఆరోపణలు తాను మర్చిపోలేనని, అలా మాట్లాడటం తనకు బాధ కలిగించిందని అన్నారు. కొంతమంది స్థానికంగా పనులు కాక తన దగ్గరకు వస్తే.. పార్టీ కార్యకర్తల కోసం తాను పనులు చేయించానని, కానీ అక్కడ నాయకులు తనపైనే ఇప్పుడు ముఖ్యమంత్రికి చెప్పే స్థాయికి ఎదిగారని చెప్పారు. డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి బాధ్యత తీసుకుంటే అతను వెనక తామందరం ఉంటామనిఅక్కడ ఉన్న వారు వివరించారు. సమావేశంలో డాక్టర్ మాదాసి వెంకయ్య, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, శీలం రాము, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, పామర్తి మాధవరావు, పల్లా అనూరాధ, ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ షేక్ షకీల, యనమల మాధవి, రాపూరి ప్రభావతి, చుక్కా కిరణ్ కుమార్, చొప్పర వెంకన్న పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఈకేవైసీ నమోదు

- ఉద్యోగుల బదిలీ సందర్భాలలో ఈ ప్రక్రియ దోహదం
- ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి..
- జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాలో ఉద్యోగుల ఈకేవైసీ నమోదు ప్రక్రియ రికార్డు స్థాయిలో పూర్తయినట్లు జిల్లా ఖజానాధికారి ఏ.జగన్నాథరావు తెలిపారు. జిల్లాలో ఉద్యోగులు, పెన్షనర్లు జీతభత్యాల చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వం ఈకేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 99 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఉద్యోగులు ఒకచోట నుండి ఒక చోటకి బదిలీ అయినప్పుడు, ఉద్యోగ విరమణ పొందినప్పుడు ఇతర సందర్భంలోనూ ఆర్థిక (జీతాలు, ఇతరములు) లావాదేవీలకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని తెలిపారు. ఉద్యోగికి సంబంధించిన వివరాలను క్షణాల్లో పొందేందుకు వెసులుబాటు కలుగుతుందని జగన్నాథరావుతో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

జిల్లాలోని 38 మండలాలకు సంబంధించి 8 సబ్ ట్రెజరీల పరిధిలో గత మార్చి నెల నాటికి 37,480 ఉద్యోగులు 14,810 పెన్షనర్లు ట్రెజరీ పరిధిలో నమోదయి ఉన్నారు. 714 పంచాయతీలు, 612 సచివాలయ పరిధిలోని వేలాది మంది వాలంటీర్లకు సంబంధించిన ఈ కెవైసి నమోదు ప్రక్రియ దాదాపు పూర్తయింది. వీరికి ప్రభుత్వం నుంచి గౌరవవేతనం చెల్లిస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించి 1410 మంది డిడిఓల ద్వారా జీతభత్యాలను ప్రభుత్వం ప్రతి నెలా చెల్లిస్తోంది.

సిఎఫ్‌ఎంఎస్ ద్వారా ఉద్యోగుల జీతభత్యాలు:

జిల్లాలో ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లు, వాలంటీర్ల గౌరవ వేతనంతో పాటు స్థానిక సంస్థలకు కేటాయిస్తున్న నిధులు సిఎఫ్ఎంఎస్ ప్రక్రియ ద్వారా చెల్లించడం జరుగుతోంది. ఈ ప్రక్రియ ప్రవేశపెట్టిన తరువాత బిల్లులను ఆమోదించడంతో వరకే ట్రెజరీ పరిధిలో ఉంటుందని తెలిపారు. నిధులను పంపిణీ ప్రక్రియ సిఎఫ్ఎంఎస్ ద్వారా మాత్రమే చెల్లించే వెసులుబాటు కలిగింది. ఈ కారణంగా నిధుల చెల్లింపు విషయంలో జవాబుదారీతనం పెరిగింది.

పేపర్ రహిత లావాదేవీలు:

సిఎఫ్ఎంఎస్ ప్రక్రియతో పాటు ఈకేవైసీ వంటి ప్రక్రియతో లావాదేవీలు పేపర్ రహితంగా కొనసాగుతున్నాయి. గతంలో ఫిజికల్ రికార్డును మెయిన్‌టెన్ చేయటం, వాటిని భద్రపరచటం వంటి ప్రక్రియ కొనసాగింది. జాతీయ విపత్తులు సంభవించినప్పుడు రికార్డులు ధ్వంసం అవ్వడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన సిఎఫ్ఎంఎస్ ప్రక్రియ సమాచారం శాశ్వతంగా సంక్షిప్తం అవడానికి దోహదపడుతుంది.

ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్లు..

జిల్లాలోని పెన్షన్‌దారులందరూ ప్రతి ఏటా అందించే లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28లోగా అందించాలలి. పెన్షనర్లు తమ సబ్ ట్రెజరీ పరిధిలో స్వయంగా గానీ ప్రతినిధి ద్వారా గానీ అందజేసే వెసులుబాటు ఉంది. వయోభారంతో ఉన్న పెన్షనర్లు, దీర్ఘకాలిక వ్యాధితో కదలలేని స్థితిలో ఉన్న వారు తమ సబ్‌ట్రెజరీ పరిధిలోని అధికారికి తెలియజేస్తే కార్యాలయ సిబ్బంది పెన్షనర్‌ను సంప్రదించి.. ఈకెవైసీ ప్రక్రియ పూర్తి చేసి లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరించే వెసులుబాటు కల్పించడం జరుగుతుంది. జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యి పెన్షనర్ తన లైఫ్ సర్టిఫికెట్‌ను నమోదు చేసుకుని సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయానికి అందజేసే వెసులుబాటును కూడా పొందవచ్చు.

ఫిబ్రవరి ఆఖరిలోగా ఇనకం టాక్స్ రిటర్న్స్..

జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు ఫిబ్రవరి 28 లోగా యాన్యువల్ ఇన్కమ్ టాక్స్ రిటర్న్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ప్రస్తుతం ఏ నెలకానెల ఇన్కమ్ టాక్స్ రిటర్న్ సమర్పించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలి.